సాక్షి
తిరుపతి
గురువారం । 2 । నవంబర్ । 2023



నిజం గెలిచినప్పడే..


చంద్రబాబుపై అవినీతి కేసు అలానే ఉందని, నిజం గెలిచినప్పుడే టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవాలని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హితవు పలికారు.

- 10లో



అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు పద్మావతి అమ్మవారిని బుధవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ దర్శించుకున్నారు.



స్వర్ణ రథంపై వరసిద్ధుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారు బుధవారం రాత్రి స్వర్ణ రథంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు.

న్యూస్‌రీల్

ఆగమోక్తంగా సంకట చతుర్థి వ్రత పూజలు



హోమ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయంలో బుధవారం ఆగమోక్తంగా సంకట చతుర్థి పూజలు నిర్వహించారు. ప్రతి కుటుంబం ఈ పూజలు నిర్వహించుకునేలా ఆర్జిత సేవగా మార్చారు. బుధవారం అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేపట్టి, విశేషంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, అధికారులు, వేదపండితులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి



ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గూడూరు తహసీల్దార్ లీలారాణి

గూడూరురూరల్ : గూడూరు తహసీల్దార్ బాల లీలారాణికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఈమేరకు తహసీల్దార్ లీలారాణి బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు చెప్పారు. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన లీలారాణికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వరదయ్యపాళెం తహసీల్దార్‌కు..



గౌరిశంకరరావును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

వరదయ్యపాళెం: తహసీల్దార్‌గా గౌరిశంకరరావు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. మంగళవారం ప్రభుత్వం జారీ చేసిన పలువురు సీనియర్ తహసీల్దార్ల పదోన్నతుల జాబితాలో ఆయనకు చోటు లభించింది. ఈ సందర్భంగా ఆయనకు మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన గౌరిశంకరరావు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందడం అభినందనీయమన్నారు. అభినందనలు తెలిపిన వారిలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి జయచంద్రారెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి లతీఫ్, డైరెక్టర్ అబ్దుల్, మండల రైతు సలహా కమిటీ అధ్యక్షుడు మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్గో సేవలు సద్వినియోగం చేసుకోండి



కార్గో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీపీటీఓ

తిరుపతి అర్బన్: ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తమ చాంబర్‌లో కార్గో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సేవలను విస్తృతం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రైవేటు కార్గోలతో పోల్చుకుంటే ఆర్టీసీ కార్గోలో చార్జీలు చాలా తక్కువగా ఉన్నాయని వెల్లడించారు. అంతేగాకుండా ఆర్టీసీ సురక్షితంగా సరుకులను పంపుతున్నట్లు చెప్పారు. మరోవైపు డోర్ డెలివరీ చేస్తున్న విషయాన్ని వివరించారు. చిరు వ్యాపారుల నుంచి పెద్ద పెద్ద వ్యాపారులు సైతం ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ పార్థసారథి, కార్గో జిల్లా ఇన్‌చార్జ్ సురేంద్రబాబు, మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలంతోనే ఆంధ్ర రాష్ట్ర అవతరణ సాధ్యపడిందని వక్తలు తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు దిశగా 1953లో 58 రోజుల పాటు అమరజీవి నిరాహార దీక్ష చేస్తే, భాషా ప్రాతిపదికన ఏర్పాటైన మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని తెలిపారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందించినప్పుడే స్వాతంత్ర్య సమరయోధుల ఆశయ సాధనకు కృషి చేసిన వారవుతామన్నారు.

పొట్టి శ్రీరాములకు నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం, కలెక్టర్, ఎస్పీ, అధికారులు



అమరజీవి త్యాగఫలితమే..

సమావేశంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని వివరించారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారని కొనియాడారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడమే కాకుండా విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం చదువులను అందించడంతో పాటు సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నారని చెప్పారు. ఇటీవల జగనన్న సురక్ష పేరుతో ఇంటింటికి వెళ్లి వైద్యసేవలు అందిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు.

- అమరజీవి సేవలు ఆదర్శం: డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- పొట్టి శ్రీరాములు మార్గదర్శకుడు: కలెక్టర్ వెంకటరమణారెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ వేడుకలు

తిరుపతి అర్బన్: సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం పాలన అందిస్తోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పండుగలా నిర్వహించారు. ఈ వేడుకల్లో అన్ని విభాగాలకు చెందిన జిల్లా అధికారులతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందన స్వీకరించారు. అనంతరం పొట్టి శ్రీరాముల చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణరెడ్డి, ఎస్పీ పరమేశ్వర రెడ్డి, జేసీ డీకే బాలాజీ,. డీఆర్వో పెంచల కిషోర్, అడిషనల్ ఎస్పీ వెంకట్రావ్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు..

జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు మార్గదర్శకుడని తెలిపారు. 2014 జూన్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత తెలంగాణ రాష్ట్రం ఎక్కువ ఆదాయం, ఏపీలో తక్కువ ఆదాయం గల రాష్ట్రంగా ఏర్పడిందని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఎంతోమేలు చేకూరుతోందన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులు, మల్టీ పర్పస్ ఫెసిలిటీ గోడౌన్లు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు, ఆర్బీకేలు, సచివాలయాల వ్యవస్థ ఏర్పాటుతో ప్రజాసంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, డీఆర్వో పెంచల కిషోర్, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీసిటీలో 'జాగృతి జీ20 స్టార్టప్ 20' బృందం



జాగృతి ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

వరదయ్యపాళెం: దేశంలోని వివిధ రాష్ట్రాలు, జీ 20 దేశాలకు చెందిన 520 మంది జాగృతి జీ20 స్టార్టప్ 20 యాత్ర బృందం బుధవారం శ్రీసిటీని సందర్శించింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేసే లక్ష్యంతో జాగృతి సేవా సంస్థాన్ అనే స్వచ్ఛంద సంస్థ ఏటా ఇలాంటి యాత్ర చేపడుతుంది. ప్రత్యేక రైలులో దేశమంతటా పర్యటించి వివిధ రంగాలలో ప్రముఖులను కలుస్తూ ఉంటుంది. అందులో భాగంగా శ్రీసిటీ సందర్శనకు వచ్చిన బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ జాగృతి యాత్ర బృందం శ్రీసిటీకి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. భారీ ఉద్యోగాల కల్పనతో అత్యంత అనుకూల వ్యాపార నగరాల్లో ఒకటిగా రూపుదిద్దుకున్న శ్రీసిటీ జాగృతి యాత్ర దర్శనీయ స్థలాల్లో చేరడం గౌరవప్రదంగా భావిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించే అవకాశమున్న 10 గొప్ప ప్రదేశాల్లో శ్రీసిటీ ఒకటిగా ఎదిగిందని వెల్లడించారు. ప్రస్తుతం 28 దేశాల నుంచి 210కి పైగా కంపెనీలు శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టినట్లు వివరించారు. జాగృతి ప్రతినిధులు మాట్లాడుతూ రోల్‌మోడల్‌గా ఎంచుకున్న రవీంద్ర సన్నారెడ్డిని కలిసి పలు విషయాలను తెలుసుకున్నామన్నారు. అనంతరం శ్రీసిటీలోని ఈప్యాక్, ఆంబర్, థర్మ్యాక్స్, వీఆర్వీ, ఆక్సిలెంట్ ఫార్మా, జెడ్‌టీటీ, ఏఎల్ఎఫ్, ఎంఎండీ, బెర్జిన్ పైప్స్ పరిశ్రమలను సందర్శించారు. శ్రీసిటీ పర్యటనకు అవకాశం కల్పించిన యాజమాన్యానికి జాగృతి సంస్థ సీఈఓ అశుతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పార్వతీపరమేశ్వరులకు ఘనంగా పుష్పయాగం



పూలంగి సేవలో దర్శనమిస్తున్న ఆది దంపతులు

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి) ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం స్వామి వారికి పుష్పయాగాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు మల్లెపూలు, కనకాంబరాలు, రోజాలు, చామంతి, బంతి, కమలం, తంగేడు, బిల్వపత్రం తదితర పలు అనేక పుష్పాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు త్రిశూల స్నానం

ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే త్రిశూలస్నాన ఘట్టంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉదయం 9 గంటలకు త్రిశూల స్నాన ఘట్టాన్ని వేడుకగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు రావణాసుర వాహనం, రాత్రి 7.30 గంటలకు నిర్వహించే ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి.

నేడు చిత్తూరులో బస్సుయాత్ర..

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు జిల్లా కేంద్రంలో గురువారం సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహించనున్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరిస్తూ మద్దతు తెలిపేందుకు చిత్తూరు ప్రజలు సిద్ధమయ్యారు. యాత్రను విజయవంతం చేసేందుకు భారీగా జనం విచ్చేయనున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

సామాజిక సాధికారత యాత్ర ఏర్పాట్లను బుధవారం అటవీ, విద్యుత్ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు భరత్, మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్‌లతో కలిసి పరిశీలించారు. స్థానిక కట్టమంచిలోని కల్యాణమండపంలో నిర్వహించనున్న విద్యావేత్తల సమావేశ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అక్కడ నుంచి నాగయ్య కళాక్షేత్రం వద్ద బహిరంగ సభ ఏర్పాట్లను చూసి ఎస్పీ రిశాంత్‌రెడ్డికి తగు సూచనలు చేశారు. చివరిగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అధికార, అనధికారులతో సమావేశమయ్యారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

వైభవంగా సుబ్రమణ్యస్వామి విగ్రహావిష్కరణ





సుబ్రమణ్యస్వామి విగ్రహ ఆవిష్కరణకు విచ్చేసిన భక్తులు, సుబ్రమణ్యస్వామికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



కలశాలను తీసుకెళుతున్న ఎమ్మెల్యే, తుడా చైర్మన్

- 54 అడుగుల భారీ విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- మోకాళ్లపై 100 మెట్లను ఎక్కిన ఎమ్మెల్యే
- పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- విగ్రహావిష్కరణకు అశేషంగా విచ్చేసిన భక్తజనం

పాకాల : స్థానిక పాళెంకొండపై వెలసి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆంధ్రప్రదేశ్‌లో రెండవ అతి పెద్ద 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. బుధవారం విగ్రహ ఆవిష్కరణకు విచ్చేసిన ఎమ్మెల్యేకి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి ఆలయ నిర్వాహకులు, ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అర్చనలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో శాలువాలు కప్పి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి కొండపైకి మోకాళ్ల మీద మెట్లు ఎక్కి స్వామివారిని దర్శించుకున్నారు.

54 అడుగుల భారీ విగ్రహం..

స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద నిర్మించిన 54 అడుగుల భారీ విగ్రహాన్ని సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించారు. 14 మంది కార్మికులు సుమారు 11 నెలల పాటు శ్రమించి ఎమ్మెల్యే సూచనలతో, దాతల సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని 3 రోజులు భక్తిశ్రద్ధలతో వేద పండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, పూలమాల వేసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఏర్పాటైన 140 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహం తరహాలో, విజయనగరం తరువాత దేశంలో ఎత్తైన 54 అడుగుల భారీ విగ్రహాన్ని పాళ్యంకొండపై ఏర్పాటు చేశారు.



సుబ్రమణ్యస్వామి కొండపైకి మోకాళ్ల మీద ఎక్కుతున్న ఎమ్మెల్యే

ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం..

శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే సహకారంతో భక్తుల వసతి గృహం, కల్యాణకట్ట, పోర్టు, రూ.20 లక్షల వ్యయంతో లింక్ రోడ్డు, సమావేశ మందిరం, వాహన మండపం, భక్తుల సౌకర్యార్థం కోసం వ్యక్తిగత మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. అనంతరం వారు ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను కూడా ప్రారంభించారు. విగ్రహ నిర్మాణానికి సహకరించిన విరాళ దాతలకు స్వామివారి కరుణాకటాక్షాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామని ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. విగ్రహ ఆవిష్కరణకు భక్తులు వేలసంఖ్యలో హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు నిత్యాన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, వల్లివేడు విక్రమ్‌రెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, రఘుపతి, సర్పంచులు గౌరీశంకర్‌రాజు, కళావతి, కస్తూరి, లింగయ్య, కపిలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, గుండ్లూరి సురేష్, శ్యామల, సురేష్, అర్జున్‌రెడ్డి, అన్నాబాబు, మునిరత్నంరెడ్డి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

3న డయల్ యువర్ ఈఓ

తిరుమల: డయల్ యువర్ ఈఓ కార్యక్రమం నవంబరు 3వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఈ కార్యక్రమంలో భక్తులు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డితో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తమ సందేహాలను, సూచనలను తెలుపవచ్చు. ఇందుకు భక్తులు 0877-2263261 నంబర్‌ను సంప్రదించాలి.

శ్రీవారి దర్శనానికి 5 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 62,269 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 19,255 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో భక్తులు హుండీలో రూ.5.19 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 5 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జీవిత ధ్రువీకరణ పత్రాల గడువు పెంపు

తిరుపతి అర్బన్: టెలికాం, బీఎస్ఎన్ఎల్ విభాగాలకు సంబంధించి పింఛనుదారులు జీవిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించడానికి గడువు పెంచినట్లు ఆ విభాగానికి చెందిన సీసీఏ జాయింట్ కలెక్టర్ సంధ్య సమీర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణంగా జూన్ నుంచి అక్టోబర్ వరకు మాత్రమే గడువు ఉండేదని చెప్పారు. అయితే వందశాతం న్యాయం చేయడానికి ఈ నెల 3, 4 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీవిత ధ్రువీకరణ పత్రాలను స్వీకరించనున్నట్లు చెప్పారు. తిరుపతిలోని పీకే లేఅవుట్‌లో ఉన్న బీఎస్ఎన్ఎల్ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులో ఇవ్వాల్సి ఉందని స్పష్టం చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


ఇసుక ట్రాక్టర్, నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ సీఐ ప్రసాద్

నాయుడుపేటటౌన్ : మండలంలోని తుమ్మూరు గ్రామం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఈబీ సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ బుధవారం తెలిపారు. తమ సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా తుమ్మూరు వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు వెల్లడించారు. నాలుగు టన్నుల మేరకు ఉన్న ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, అయ్యప్పరెడ్డిపాళెం గ్రామానికి చెందిన కంపటి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. స్థానిక పోలీసులకు ట్రాక్టర్‌ను, నిందితున్ని అప్పగించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

నిజం గెలిచినప్పుడే సంబరాలు చేసుకోండి

- కంటి ఆపరేషన్ కోసమే చంద్రబాబుకు బెయిల్ ఇచ్చింది
- అవినీతి కేసు ఇంకా తేలలేదు
- ప్రజలను మభ్య పెట్టేందుకు టీడీపీ నేతల ఆర్భాటం
- వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా కోర్టు చంద్రబాబునాయుడుకు బెయిల్ ఇస్తే టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం ఏంటని, నిజం గెలిచినప్పుడు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హితవు పలికారు. రాపూరు మండలం ఆదురుపల్లి, తాతిపల్లి, శానాయిపాళెంలో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి గురించి వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగనన్నదే అన్నారు.

సామాన్య ప్రజలను మభ్య పెట్టేందుకే..

స్కిల్ స్కామ్‌లో అవినీతికి పాల్పడిన కేసు చంద్రబాబునాయుడుపై అలాగే ఉందని, అయితే అతని ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా కోర్టు బెయిల్ ఇచ్చిందని, కానీ టీడీపీ నేతలు మాత్రం సామాన్య ప్రజలను మభ్యపెట్టేందుకు సంబరాలు చేసుకుంటున్నారని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. చంద్రబాబు మళ్లీ ఈ నెల 28వ తేదీ 5 గంటలకు స్వచ్ఛందంగా జైలుకు వెళ్లాలని కూడా కోర్టు చెప్పిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల వైపు ఉంటుందని, తెలుగుదేశం పెత్తందారుల పక్షాన ఉంటుందన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన సీఎం జగనన్నదే అన్నారు. అందుకే ప్రజలు 2024లో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కావాలంటున్నారని తెలిపారు. ప్రతిచోటా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని, 175 స్థానాల్లో గెలుపు ఖాయమన్నారు. తిరుపతి జిల్లాలో 7 నియోజకవర్గాలకు గానూ 7 చోట్లా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, వెంకటగిరిలో అత్యధిక మెజారిటీ సాధిస్తామని అన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత..


సుజాతకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న నేదురుమల్లి

రాపూరు, కలువాయి మండలాలకు చెందిన ఇద్దరికి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. బుధవారం ఆయన రాపూరు సమీపంలోని తెలుగుగంగ అతిథిగృహంలో రాపూరు మండలం సంక్రాంతిపల్లికి చెందిన కె.సుజాతకు రూ.1.50 లక్షలు, కలువాయి మండలం చల్లా రమాదేవికి రూ.3.80 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారా యణరెడ్డి, రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి పట్టాభిరామిరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు శివరావమ్మ, నాయకులు రమణారెడ్డి, రమేష్, డాక్టర్ ఖాదర్‌బాషా, మధురెడ్డి, నరసింహారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ తగిలి వ్యక్తి మృతి


మృతి చెందిన కోటేశ్వర్‌రావు

ఓజిలి: ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఉద్యోగి క్రేన్ తగిలి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గూడురు గాంధీనగర్‌కు చెందిన కోటేశ్వర రావు(28) నెల్‌క్యాస్ట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున పరిశ్రమలో మెటీరియల్‌ను తరలిస్తుండగా క్రేన్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. 108 ద్వారా మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాయుడుపేట సీఐ సోమయ్య, ఎస్ఐ ఆదిలక్ష్మి ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదంపై ఆరాతీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

తడ: కట్టుకున్న భర్త, అత్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఓ మహిళ బుధవారం తడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తడకు చెందిన మేఘన 2019లో సూళ్లూరుపేట పరసారత్నం కాలనీకి చెందిన అయ్యప్పను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో మేఘన కుటుంబ సభ్యులు కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. అయితే తాగుడుకు బానిసైన అయ్యప్ప, తన తల్లి లక్ష్మితో కలసి మేఘనను తరచూ అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.